చారిత్రాత్మక కథ

# ఆరువాన్నిబ్బరగండు



డాక్టర్ చల్లా రాధాకృష్ణశర్మ

వైఘనది వయసు వచ్చిన పడుచులా గంభీరంగా ఉంది. వేసవిలో ఏర్పడిన పెద్ద పెద్ద యిసుక దిబ్బలు కూడా నీటిలో మునిగిపోయాయి.

గోధుమ వన్నెను మరిపించే నురుగు ముద్దలు కూడా నీటిలో కలిసి ఎక్కడికో, ఎందుకో జరజరా ముందుకు సాగి పోతున్నాయి. ముందుకు పోవాలనే కొండంత ఆశతో పయనం సాగిస్తున్న ఆ నురుగు ముద్దల్లో కొన్ని నదికి రెండు వైపులా ఉన్న గట్లను తగిలి తునాతునకలై తమ పూర్వాకృతిని కోల్పోయి చిన్న చిన్న ముక్కలు అవుతున్నాయి. పెద్ద చేపలు- చిన్న

చేపలు– ఇంకా రకరకాల ప్రాణులు– నదీ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నాయి. మార్గ మధ్యంలోనే చిన్న చేపలు కొన్ని పెద్ద చేపలకు ఆహార మవుతున్నాయి. పెద్ద చేపలు కొన్ని పాములకు ఆహార మవుతున్నాయి. ఇదంతా చూడలే నట్లు ఆ రోజు సర్వసాక్షి ఎవ్వరికీ దర్శన మివ్వలేదు.

నదిలో వచ్చిన వెల్లువను తండోపతండాలుగా వచ్చి చూసి వెడుతున్నారు మధురా నగరవాసులు. వరదను గురించి ఒక వృద్ధుడు గంభీరోపన్యాసం చేస్తున్నాడు. బెల్లం చుట్టూ మూగే చీమలవలె ఆయన చుట్టూ మూగారు పిన్నలూ, పెద్దలూ, స్త్రీలూ, పురుషులూను. చెవులు రిక్క పొడుచుకుని మరీ వింటున్నారు ఆ వృద్ధుని మాటలు– మధ్య మధ్య పడుతున్న వాన చినుకుల్ని కూడా లెక్కచెయ్యకుండా.

"ఇప్పుడు మనము చూస్తున్న యిటు వరదలు కూడా వస్తే, పాండ్యమండ వంటివరదను నా జీవితంలోన నేను కనీ వినీఎరగను నాకు తెలిసి వైఘనది యిప్పుడున్నంత వెడల్పుగా వుండేది కాదు. నానాటికీ నదీప్రవాహానికి గట్లు కోసుకు పోతున్నాయి. కరువులో అధికమాసంలా వుంది మన పరిస్థితి ఎక్కడ చూసినా దుష్ట మృగాల సంచారమే గదా మన దేశంలో. వాటివల్ల ఎన్నిసార్లు కలకలలాడే పంటలు పాడయ్యాయో నేను చెప్ప లేను. ఎందరు మనుషులు వాటికి బలి అయ్యారో తలుచుకుంటేనే నా గుండె చెరువవుతోంది. ఇందుకు తోడు యిలా లానికీ, మనకూ ఋణంతీరిపోతుంది...."

అక్కడ చేరిన జన సమూహానికి వృద్ధుని మాటలు తీరని విచారం, భయం కలిగించాయి కొందరికి జీవితంపట్ల విరక్తి కలిగింది.

ఇంతలో ఒక పెద్ద జల్లు పడింది. పుట్టకొకరు, గుట్టకొకరుగా వృద్ధుని చుట్టూ గుమిగూడిన జనులు పెద్ద పెద్ద చెట్ల కిందికి పరుగులెత్తారు, ఒక యువకుడి సహాయంతో వృద్ధుడు కూడా ఒక మర్రి చెట్టు కిందికి వెళ్ళాడు.

వృద్ధుని మాటలు మరిచిపోదామన్నా మరిచిపోలేని ఆ యువకుడు, "తాతగారూ! మనకు మంచి రోజు లెప్పటికైనా వస్తాయంటారా?" అన్నాడు అప్రయత్నంగా.

"ఎందుకు నాయనా, అలా నిరుత్సాహపడతావు? పడిన గోడలు పడినట్టే వుంటాయా? అవి యెప్పటికైనా పైకి లేవక తప్పదు...."

"అవుననుకోండి.... కాని...."



యువకుని మనస్సులో గూడుకట్టుకున్న భయాన్నీ, నిరుత్సాహాన్నీ వృద్ధుడు గుర్తించకపోలేదు. గొంతు సవరించుకుని యిలా అన్నాడు :

"చూడు నాయనా– లోకాన్ని ఉద్ధరించే నిమిత్తం అప్పుడప్పుడు మహానుభావులు అవతరిస్తూ వుంటారు. ఎండిపోయిన చెట్టు వసంతకాలం వచ్చేసరికి మళ్ళీ చిగురించినట్టుగా, ఆ మహనీయుల వల్ల ఎండి పోయిన మన ఆశలూ, అవీ మళ్ళీ చిగురిస్తాయి...."

"విజయనగర చక్రవర్తులవల్ల మనకు మళ్ళీ మంచి రోజులు వస్తాయంటారు, అంతేనా?"

"రావచ్చు.... దురదృష్టవశాత్తూ మన పాండ్యరాజులు బలహీనులు కావడంవల్ల, మన రాజ్యాన్ని చోళులూ, మహమ్మదీయులూ ఆక్రమించారు. విజయనగర చక్రవర్తుల పుణ్యమా అని మనం మహమ్మదీయుల బారినుంచి బయటపడగలిగాము. మళ్ళీ మన రాజ్యం మన పాండ్యరాజుల స్వాధీనమయింది" సంతోషంతో వృద్ధుని కళ్ళు మెరిశాయి.


"మనదేశం మన పాండ్యరాజుల స్వాధీనమైనందువల్ల, మనకు ఒరిగిందేమీ లేదు. ఇంతకూ దాసీ పుత్రుడు రాజ్యమేలడమేమిటి?" అన్నాడు యువకుడు అసహనం ప్రదర్శిస్తూ

యువకుని మాటలకు వృద్ధుడు నొచ్చుకున్నాడు. కోపం కూడా వచ్చింది. అయినా ఆ కోపాన్ని రవంతైనా పైకి పొక్కనీయకుండా, "నాయనా నీ మాటలు వింటుంటే నాకు నవ్వు వస్తోంది. ఎందుకంటావేమో– నిన్న మొన్నటి దాకా ఆ దాసీ పుత్రుణ్ణి మనమంతా పూజించిన వాళ్ళమే; ఆయన అడుగులకు మడుగు లొత్తిన వాళ్ళమే...."

"అప్పుడాయన రాజు కాబట్టి గౌరవించాలి." అన్నాడు యువకుడు.

"అదే నేనూ చెపుతున్నది. రాజు దాసీ పుత్రుడైనా సరే, మరెవ్వరైనా సరే ఆయన్ని గౌరవించాలి. సింహాసనం అంత గొప్పది. దానిమీద కూర్చునే అదృష్టం అందరికీ పడుతుందా?"

వృద్ధుని మాటల ధోరణి ఆ యువకుడికి నచ్చలేదు. అయినా ఆయనతో




వాదం పెట్టుకోవడం ఎందుకని మౌనం వహించాడు. ఏమనుకున్నాడో యేమో వృద్ధుడు కూడా మౌనం వహించాడు.

చూస్తూ వుండగానే ఆకాశమంతా ఏనుగుల వంటి మేఘాలకు విహారస్థలమయింది. నలుమూలలా చీకటి అలుముకుంది కళ్ళు మిరుమిట్లు గొలిపేలా మెరుపులు మెరుస్తున్నాయి. చెవులు చిల్లులు పడేలా ఉరుములు ఉరుముతున్నాయి.

ఎన్నో సంవత్సరాల తర్వాత వానలు పడడం, వైఘలో వెల్లువ రావడం వృద్ధుడికి ఒకవైపు సంతోషం కలిగించినా మరోవైపు విచారమూ కలిగింది. నదికి బలమైన గట్లులేవు. అందువల్ల, వరదనీరు ఎక్కడ మధురలోకి ప్రవేశిస్తుందో అని ఆయన భయభ్రాంతుడయ్యాడు.

కారుమబ్బుల ఆకాశాన్ని చూస్తూ "కొద్ది సేపట్లో జడివాన కురుస్తుంది. ఇక మనం వెళ్ళిపోదాం" అన్నాడు వృద్ధుడు.

సరే అన్నాడు యువకుడు.

వాళ్ళిద్దరూ నడక వేగం హెచ్చించారు.

ఆ రాత్రి ఆకాశం చిల్లిపడిందా అన్నట్టు కురిసింది. వాన. చెట్టు, చేమలు, గట్టు, పుట్టలు- అన్నీ ఏకమైనాయి. ఎలా తెల్లవారుతుందా అని భయపడ్డారు పౌరులు. గుడిసెలలో నివసించే అభాగ్యులు ఆ రాత్రి అనుభవించిన నరకం ఇంతా, అంతా కాదు.

అంతఃపురంలో పట్టు పరుపుమీద శయనించినా, మధుర రాజ్యాధినేతఅయిన విశ్వనాథనాయనయ్య వారికి కంటిమీద కునుకు పట్టలేదు, బయట వర్షపుహోరు, మధ్యమధ్య దుష్టమృగాల అరుపులు. ఆయన మనస్సు వికలమయింది.

శయ్యాగారంలో పచార్లు చేస్తూ, గవాక్షంనుంచి ఆయన బయటికిచూశాడు. కాటుకలా అలుముకున్న చీకటి. వర్షపునీరు వెల్లువలా ప్రవహిస్తున్న సవ్వడి



'మధురలో దీపావళి'
చిత్రం : మారేమండ శ్రీనివాసరావు

ఆయన చెవుల్లో మారుమోగింది. కిటికీ తలుపులు మూసివేసి శయ్యమీద ఆశీనుడయ్యాడు. వారం రోజుల క్రితం గ్రామస్థులు కొందరు నివేదించిన విషయాలు ఆయన మనస్సుని వశంచేసుకుని చిత్రవధ చెయ్యసాగాయి.

"ప్రభూ! ఏం చెప్పమంటారు మా బాధలు. పులులు, తోడేళ్ళు మొదలైన దుష్టమృగాలు మా గ్రామ పరిసరాలలో తిరుగుతున్నాయి. ఎందరో వాటి వాతబడి ప్రాణాలు కోల్పోయారు. మాకు రక్షణ కల్పించి, పుణ్యం కట్టుకోండి."

"మహాప్రభూ! మా గ్రామం చుట్టూరా చిట్టడవులు, దుష్ట మృగాల బాధతోపాటు చోరభయంతో కూడా యమయాతన అనుభవిస్తున్నాం. మాకు రక్షణ కల్పించి మా కుటుంబాలను,మా పంటల్ని కాపాడండి."

"పెద్ద మనసు చేసి ప్రభువులు మా మొరను ఆలకించాలి. వ్యవసాయ సదుపాయాలు లేకపోవడంచేత, మా గ్రామాలు బీడువారి వున్నాయి. ఎన్నో గ్రామాలు జనశూన్యములై వున్నాయి. పైగా చోరభయం రోజు రోజుకీ ఎక్కువవుతున్నది. మా బాధలు తీర్చిమమ్మల్ని ఆదుకోవాలి."

"ప్రభూ, చిత్తగించాలి. కోటలు శిథిలావస్థలో వున్నాయి. దేవాలయాలు కళాకాంతులులేక వెలవెలపోతున్నాయి. రాజ్యంలో శాంతిభద్రతలు కరువైనాయి. పాండ్యమండలానికి మణిపూస వంటి మధురానగరం కూడా దుస్థితిలో వుంది. తమరు రాజ్యంలో శాంతి భద్రతలు నెలకొల్పి, మమ్మల్ని రక్షించండి."

ఈ విషయాదికం మనస్సులో మెదులుతున్నంతసేపూ విశ్వనాథనాయనయ్యకు తన జనకుడు నాగమనాయడు మాటిమాటికి స్ఫురణకు వచ్చాడు. తాను కన్నతండ్రిపై కత్తి కట్టినందుకు పరితపించాడు. స్వామిభక్తి అనే మిషతో పితృభక్తిని చంపుకున్న వ్యక్తిగా ఆయన తనను అభివర్ణించుకున్నాడు.

ఆ రోజు అచ్యుత దేవరాయలవారు తనను దక్షిణ సింహాసనాధ్యక్షుడుగా ప్రకటించినప్పుడూ, పలువగ బిరుదులిచ్చి ఘనంగా సన్మానించినప్పుడూ తాను పొందిన ఆనందోత్సాహాలకు అంతు

లేదు. విజయనగరాధి దేవత అయిన దుర్గాదేవివిగ్రహం బహూకరించి రాయలవారు తనను మధురానగరానికి సాగనంపినప్పుడు తన్ను తాను విస్మరించాడు. ఆ ఆనందోత్సాహాలలో మునిగిపోయి కన్న తండ్రిని మరిచిపోయినందుకు పరితపించాడు; తన అవివేకాన్ని గుర్తు చేసుకున్నాడు. నిజమైన స్వామిభక్తుడుగా తన తండ్రి తన మనోనేత్రం ముందు సాక్షాత్కరించాడు.

ఆ రోజుల్లో శ్రీ కృష్ణదేవరాయలవారు దొరతనం చేసే రోజుల్లో— విశ్వనాథ నాయకుడు తండ్రివెనక అడుగులో అడుగు వేస్తూ, బెదురు చూపులతో, రాయలవారి కొలువు కూటం ప్రవేశించాడు. మంత్రులూ,కవిపండితులూ, దండనాథులూ మొదలైనవారితో ఆ సుందర మందిరం కిటకిటలాడుతోంది. తనతండ్రి సామాన్యుడా! సేనాధిపతి! కోశాధికారి! రాయలవారి కుడిభుజం. ఆయన కొలువు కూటం ప్రవేశించే సరికి, ఎందరెందరో ప్రముఖులు లేచి నిలబడ్డారు: ఆదరపూర్వకంగా చేతులు జోడించారు.

ఆయన వెంట నడుస్తూ, రాయలవారి సింహాసనాన్ని సమీపించడం తరువాయి విశ్వనాథ నాయకుడికి ముచ్చెమటలు పోశాయి. తన తండ్రి గొప్పతనం లీలగా అర్థమయింది.

"నాగమ నాయడుగారూ— ఈ చిన్నవాడు కాశీవిశ్వనాథులవారి కరుణా కటాక్షం వల్ల పుట్టినవాడేనా?" అని ఆదరంగా అడిగారు రాయలవారు.

"అవును ప్రభూ!" చేతులు కట్టుకుని జవాబు చెప్పాడు నాగమనాయడు.

"సంతానంలేని మీరు నిన్న మొన్న కాశీకి ప్రయాణమై వెళ్ళినట్టుగా కనిపిస్తోంది నాకు.... ఎంతలో ఎంత ఎదిగాడు మా కాశీ విశ్వనాథుడు! ఇలా రా బాబూ...." అంటూ రాయలవారు ఆ చిన్నవాణ్ణి తన దగ్గరకు రప్పించుకున్నారు. అతని వంక చూస్తూ ఆయన అన్నారు గదా: "నాగమనాయడుగారూ! మీరు చాలా అదృష్టవంతులు. మీ అబ్బాయిని చూస్తుంటే ఎందుకో నా వద్దే వుంచుకోవాలనిపిస్తోంది."

"నిజంగా నేను అదృష్టవంతుణ్ణే ప్రభూ!"

"మీకు అభ్యంతరం లేకపోతే, మీ అబ్బాయిని మా తాంబూల కరండవాహకుడుగా నేటినుంచే నియమించుకోవాలని అభిలషిస్తున్నాం."

"విశ్వనాథుడు ఎంతో అదృష్టవంతుడు; చిన్నతనంలోనే ప్రభువుల ప్రేమకు పాత్రుడయ్యాడు" అని కొలువుకూటంలో సన్నసన్నగా వినిపిస్తుంటే, నాగమనాయడు కృతజ్ఞతా పూర్వకంగా "తమ చిత్తం ప్రభూ" అన్నాడు.


ఒక్కసారి హర్షధ్వానాలతో ఆ భవనం ప్రతిధ్వనించింది.

తదాదిగా విశ్వనాథనాయకుడు శ్రీకృష్ణదేవరాయలవారి భృత్యుడు! అతడంటే ప్రభువుకి కలిగిన ఆదరమూ, అభిమానమూ నిరుపమానం. కాలక్రమాన అతడు విశ్వాసపాత్రుడైన భృత్యుడయ్యాడు. అందుకే ఆనాడు నిండు కొలువులో రాయలవారు "నాగమనాయణ్ణి ప్రతిఘటించే వీరులెవరైనా వున్నారా?" అని ప్రశ్నించగా "లేకేం ప్రభూ" అంటూ ప్రత్యుత్తరమిచ్చాడు విశ్వనాథ నాయకుడు. ఆ స్వామిభక్తి ముందు పితృభక్తి తలయొగ్గింది.

'ఇంతకూ తన తండ్రి చేసిన తప్పేమిటి?' అనే ఆలోచనలో పడ్డాడు విశ్వనాథనాయకుడు.

రాయలవారి ఆజ్ఞననుసరించి నాగమనాయకుడు ససైన్యంగా వెడలి పాండ్యమండలాన్ని తన చేజిక్కించుకున్న వీరశేఖర చోళుని యుద్ధంలో జయించాడు. తర్వాత ఆయన మధురకు ప్రయాణమయ్యాడు. పూజా పురస్కారములులేక బూజుపట్టిన ఆలయంలా మధుర దర్శనమిచ్చింది! పాండ్య మండలాధిపతి చంద్రశేఖర పాండ్యుడు అసమర్థుడుగా కనిపించాడు. పైగా దాసీ పుత్రుడట! అందువల్లనో, మరెందువల్లనో అతనంటే పౌరులు అనాదర భావం ప్రకటించసాగారు. మధురలో శాంతి భద్రతలు స్థిరంగా నెలకొనాలంటే సమర్థవంతమైన పరిపాలన నెలకొనాలని అనాయాసంగా గ్రహించాడు నాగమనాయడు. ఆ మరుక్షణమే కార్యాచరణలో నిమగ్నుడయ్యాడు. ప్రభుత్వ ద్రవ్యంతో పాటు తన నిజ ద్రవ్యమును కూడా మధురలో శాంతిస్థాపనకోసం వినియోగించాడు. దుష్టమృగాలు ఆయన ఖడ్గధాటికి నిలవలేకపోతున్నాయి. చిట్టడవులు తలలు తెగిన మొండెములుగా కనిపిస్తున్నాయి. గుండెలమీద చేతులు పెట్టుకుని ప్రజలు నిద్రిస్తున్నారు. పాండ్య మండల మంతటా సుఖశాంతులు నెలకొంటున్నాయి. నాగమనాయని పెదవుల మీద సుందర దరహాసం తళుక్కుమన్నది. పడిన కష్టం ఫలిస్తున్న తృప్తి భావం ఆయన గుబురు మీసాలచాటున కానవచ్చింది. ఆ తరుణంలో అశనిపాతంలా వచ్చిపడింది రాయలవారి ఆజ్ఞ. నాగమనాయనికి నడుమువిరిగినట్లయింది.

"మధురను వెంటనే చంద్రశేఖర పాండ్యుని వశంచేసి విజయనగరానికి మరలి రావలసింది." ఇదీ రాయలవారి ఆజ్ఞ.



మధురలో శాంతి భద్రతలు స్థాపించి ప్రజల బాధలు తీర్చాలన్న సదుద్దేశంతో నాగమనాయడు రాయలవారి ఆజ్ఞను అతిక్రమించాడు. తన అభిప్రాయాలను ప్రభువుకి తెలియజేశాడు. అయినాసరే, మొట్టమొదట తన ఆజ్ఞను పాటించవల సిందే- అన్నారు కఠినంగా రాయలవారు. కాని తద్విరుద్ధంగా ప్రవర్తించాడు నాగమనాయడు. ఫలితం- తండ్రీ కొడుకులకు యుద్ధం అనివార్యమయింది. జయలక్ష్మి విశ్వనాథ నాయకుని వరించింది.

ఈ వివిధ విషయాలూ, ప్రజల దీనాలాపాలూ విశ్వనాథ నాయనయ్య హృదయాన్ని కలచివేశాయి. తన తండ్రి సదుద్దేశంతో ప్రారంభించిన కార్యాన్ని తాను నిర్వర్తించి ఆయన ఆత్మకు శాంతి కలిగించాలని అభిలషించాడు. బయట వాన కురుస్తున్నంతసేపు ఆయన ఆలోచనలు తెగలేదు. బాధావహులైన ప్రజలమీద ఆయన మనస్సు లగ్నమయింది.

## 3

అది అభ్యంతర గృహం.

ఉన్నతాసనం మీద విశ్వనాథనాయనయ్య ఆసీనుడయ్యాడు. ఆయనకి దగ్గరగా యువరాజు కృష్ణప్పనాయకుడు ఒక ఉచితాసనం అలంకరించాడు. వారిద్దరికీ అభిముఖంగా దళవాయి ప్రధాని అరియనాథ మొదలి, దళవాయి బిసపాకం కేశవప్పనాయడు, రామభద్రప్పనాయడు ఆసీనులయ్యారు. ప్రశాంత గంభీర వాతావరణం ఆ మందిరంలో నలుమూలలా నెలకొన్నది.

"రాజ్యంలో శాంతిభద్రతలు కరువైన విషయాన్ని తలుచుకుంటేనే మామనస్సు వెయ్యి ముక్కలవుతోంది. ప్రజల్ని బాధల నుంచి తప్పించడం మన విధ్యుక్తధర్మం ...." విశ్వనాథనాయనయ్య గద్గద కంఠుడై అన్నాడు.

"అవును ప్రభూ- తమరన్నది అక్షరాలా నిజం. పేదవారు మరీ బాధపడుతున్నారు. పేదరికం ఎంత బాధాకరమో నాకు బాగా తెలుసు," అన్నాడు దళవాయి ప్రధాని.

"పేద కుటుంబంలో పుట్టి పెరిగిన అరియనాథ మొదలిగారు మా దళవాయి ప్రధాని కావడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ప్రజాక్షేమాన్ని వుద్దేశించి మీరు ఏ పని తలపెట్టినా, అందుకు మా సహాయం మీకు పరిపూర్ణంగా లభించగలదు. తక్షణ కర్తవ్యం ఏమిటో మీరు సూచించాలి.

"చిట్టడవుల్ని ఛేదించి, గ్రామాలు నిర్మించాలి...."

"అందువల్ల దుష్టమృగాల భయం కూడా తొలగిపోతుంది," అన్నాడు కేశవప్పనాయడు.

"అసలు మధురానగరం కూడా కళావిహీనంగా వుంది. దీన్ని పునరుద్ధరించడం చాలా అవసరం." ఇది రామభద్రప్పనాయని అభిప్రాయం.

"మీరన్నది నిజం. మీనాక్షీ సుందరేశ్వరుల ఆలయం కూడా కళావిహీనంగా కనిపిస్తోంది. గుడికి వెళ్ళినప్పుడల్లా, ఆలయాన్ని ఎలా పునరుద్ధరించాలా అనే ఆలోచిస్తాను...." అన్నాడు విశ్వనాథ


Grams : "CARE COMFORSTAY" Phone : 61251 (10 Lines)



HOTEL mamata

హోటల్ మమత గవర్నరుపేట, విజయవాడ-2.

* ఒకేసారి 3 సమావేశములు A. C సౌకర్యముతో నిర్వహించుటకు వీలయినది మమత A. C. కాన్ఫరెన్స్ హాల్.
* పట్టణములోకెల్లా అతి పెద్దదైన A. C. రెస్టారెంట్.

నాయనయ్య.

"దైవకార్యంలో తగినంత శ్రద్ధ వహించడం ప్రభువులకు శ్రేయస్కరం." అన్నాడు రామభద్రప్పనాయుడు.

"మీరు మా నాయనగారి ఆప్తమిత్రులు కనుక మీ అభిప్రాయాన్ని ఆదేశంగా శిరసావహిస్తున్నాను."

"నాగమనాయనివారి ఆదరాన్నీ, మీ అభిమానాన్నీ పొందిన నేను అదృష్టవంతుణ్ణి."

ఆ తర్వాత రెండు మూడు క్షణాలు ఎవ్వరూ మాట్లాడలేదు.

"ఇంతవరకూ పెద్దలు సెలవిచ్చిన అభిప్రాయాలన్నీ అమూల్యములే. కాని నా దృష్టిలో పూర్వపు పాండ్యరాజుల సంతతివారితో సఖ్యభావంతో సంచరించినప్పుడే ఈ పాండ్య మండలంలో శాంతి సుస్థిరంగా నెలకొంటుంది." అన్నాడు యువరాజు తండ్రిని చూస్తూ.

"యువరాజుగా అభిప్రాయం రాజ్య సుస్థిరతకే కాకుండా శాంతిస్థాపనకు కూడా ఎంతగానో తోడ్పడుతుందనడంలో అణుమాత్రమైనా సందేహం లేదు. ఈ విషయాన్ని ప్రభువులు సావధానంగా ఆలోచించి, రాజ్య సుస్థిరతకు వుపకరించే ఒక విధానాన్ని అవలంబించాలని కోరుతున్నాను." అని దళవాయి ప్రధాని యువరాజు వెలిబుచ్చిన అభిప్రాయాన్ని సమర్థించాడు.

విశ్వనాథనాయనయ్య ఆలోచనా నిమగ్నుడయ్యాడు.

"ప్రభువులకు జయం!"

"ఎవరు?" అధికారస్వరంతో అడిగాడు అరియనాథ మొదలి.

"తిరునల్వేలి నుంచి వచ్చిన వార్తాహరుడు ప్రభువుల దర్శనార్థం వేచి వున్నాడు."

అరియనాథ మొదలి ప్రభువు వంక చూశాడు.

"ప్రవేశపెట్టండి."

వెంటనే ఆ వార్తాహరుణ్ణి లోపలికి తీసుకువచ్చారు. దళవాయి ప్రధాని సమక్షంలో అతడు ఒక లేఖను సవినయంగా ఉంచాడు. అతడు నిష్క్రమించిన తర్వాత, ఆ లేఖను చదువుకున్నాడు దళవాయి ప్రధాని. "యువరాజుగారి అభిప్రాయాన్ని యిప్పుడు ప్రభువులు మన్నించక తప్పదు."

"ఇంతకూ అసలు విషయమేమిటో సెలవిచ్చారు కారు."

"ప్రాచీన పాండ్యరాజుల సంతతికి చెందిన అయిదుగురు రాజులు తిరునల్వేలి మండలాన్ని పరిపాలిస్తున్నారు. ఆ అయిదుగురూ తమ రాజ్యాధికారాన్ని ప్రతిఘటిస్తున్నారట."

"వారేనన్నమాట పంచపాండ్యులు...."

"మొదటి నుంచీ వాళ్ళు తమ అధికారాన్ని ప్రతిఘటిస్తూనే వున్నారు."

"అయితే వీరి విషయంలో మనం జాగ్రత్తగా వుండడం అవసరమనుకుంటాను."

"తమ అనుజ్ఞ అయితే ఆ తిరుగుబాటుని అణిచే నిమిత్తం త్వరలోనే తిరునల్వేలికి ప్రయాణమవుతాను."

"మీ మాటను మేమెన్నడూ కాదనలేదు."

"తిరుగుబాటుని తప్పకుండా అణచవలసిందే. కాని.... సరాసరి యుద్ధానికి దిగకుండా, మంచిమాటలకు వాళ్ళు లొంగుతారేమో దళవాయి ప్రధానిగారు ప్రయత్నించాలని నా మనవి." అన్నాడు కృష్ణప్పనాయకుడు.

విశ్వనాథనాయనయ్య నవ్వుతూ కొడుకుని చూశాడు. ఆయన అభిప్రాయాన్ని పసిగట్టిన దళవాయి ప్రధాని "చిన్నవారైనా, యువరాజుగారు చక్కని మాట సెలవిచ్చారు. అలాగే చేస్తాను" అన్నాడు.

## 4

అప్పుడే విశ్వనాథనాయనయ్య పూజా మందిరం నుంచి వెలుపలికి వస్తున్నాడు.

మందిరానికి మూడు గజాల దూరంలో ముకుళిత హస్తుడై రామభద్రప్పనాయుడు నిలబడి వున్నాడు.

"ప్రభువులకు జయం కలగాలి."

"రండి.... క్రొత్త విశేషాలేమైనా వున్నాయా?"


"తిరునల్వేలి నుంచి వచ్చిన వార్తాహరులు తమ దర్శనం కోసం బయట వేచివున్నారు."

"అలాగా....!" నడక వేగం హెచ్చించాడు విశ్వనాథనాయనయ్య. దోవలో ఉన్నట్టుండి ఒక చోట ఆగి "రాయలవారికి తిరునల్వేలి యుద్ధ విషయం తెలియజెయ్యకపోవడం పొరపాటనిపిస్తోంది" అన్నాడు.

"ఇందులో ప్రభువుల పొరపాటు ఏమీ లేదని నా అభిప్రాయం."

"కాదు రామభద్రప్పగారూ, మీరు నా మీద వున్న అభిమానం కొద్దీ అలాఅంటున్నారు కాని.... ఈ విషయం రాయలవారికి నివేదించకపోవడం పొరపాటనే నేననుకుంటున్నాను రాయలవారు మన ప్రభువులు...."

"నేను కాదనడం లేదు, కాని తమరు స్వతంత్రులు. మీ నాయనగారి సొంత ద్రవ్యంకూడా వినియోగించి మీరు రాజ్య క్షేమం కోసం ఎన్నో మంచి పనులు చేస్తున్నారు...."



"కావచ్చు. అయినా, అచ్యుతదేవ రాయలవారి అధికారాన్ని నేను సహర్షంగా అంగీకరిస్తున్నాను. అటువంటప్పుడు తిరునల్వేలి యుద్ధ విషయాన్ని వారికి తెలియజెయ్యక పోవడం సమంజసం కాదు. ఈ విషయమై ప్రభువులకు తెలియజేస్తూ ఒక లేఖ తయారుచెయ్యాలని నా కోరిక."

"చిత్తం."

విశ్వనాథనాయనయ్య అభ్యంతర గృహం చేరుకునేసరికి, అక్కడ కృష్ణప్ప నాయకుడు కనిపించాడు. అతడు రాజ్య వ్యవహారాలలో తగినంత శ్రద్ధ ప్రదర్శిస్తున్నందుకు ఆయన హృదయం సంతోషంతో నిండిపోయింది.

విశ్వనాథనాయనయ్య ఆసీనుడైన తర్వాత, తిరునల్వేలి నుంచి వచ్చిన వార్తాహరులు రామభద్రప్పనాయనికి ఒక లేఖ యిచ్చి వెళ్ళిపోయారు.

"దళవాయి ప్రధానిగారు రాశారు."

"చదవండి. ఏం రాశారో?"

"ప్రభువుల ఆజ్ఞ ననుసరించి, పంచ పాండ్యులతో యుద్ధ నివారణకు ప్రయత్నించాను. ఎంత సౌమ్యంగా చెప్పినా, వాళ్ళు దోవకు రాలేదు. చివరికి యుద్ధం తప్పనిసరి అయింది. మన వీరులు ధైర్యోత్సాహాలతో యుద్ధం చేస్తున్నారు. విజయం మనవైపే వున్నది. కాని, తిరువడి మండలం అధిపతి అయిన భూతల రామవర్మ పంచపాండ్యుల పక్షంవహించి మనతో యుద్ధానికి దిగుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. భూతల రామవర్మ పంచ పాండ్యులకు ప్రాణ మిత్రుడని విన్నాను. కనుక ఏకకాలంలో రెండు యుద్ధాలు చెయ్యడం అనివార్యమవుతున్నది. ఈ విషయమై ప్రభువులు సావధానంగా ఆలోచించి, తగినంత సైన్యాన్ని తిరువడి మీదికి పంపవలసిందిగా సవినయంగా అర్థిస్తున్నాను...."

"రామభద్రప్పగారూ...." విశ్వనాథనాయనయ్య ముఖంలో కోపం కానవచ్చింది. "తిరువడి పాలకుడు కూడా మనల్ని ప్రతిఘటిస్తున్నాడన్నమాట!"

"ప్రభువులు అనుమతిస్తే, నేను ససైన్యంగా తిరువడి మీదికి వెడతాను." అన్నాడు యువరాజు.

"అలాగే ..కాని...."




"ప్రభువులు సందేహిస్తున్నట్టున్నారు...."

"ఇప్పుడు మనవద్ద సైన్యం చాలా తక్కువగా వుంది. చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలిగదా!"

రెండు క్షణాలు మౌనంవహించి విశ్వనాథనాయనయ్య యిలా అన్నాడు.

"రామభద్రప్పగారూ, వెంటనే అచ్యుత రాయలవారికి యిక్కడి విషయాలన్నీ తెలియజేస్తూ లేఖ రాయండి. తిరువడి పాలకుడి ప్రతిఘటనను కూడా వివరించండి. దళవాయి ప్రధానిగారు చెప్పినట్టు, ఏకకాలంలో రెండు యుద్ధాలు చెయ్యడం ప్రస్తుతం మన శక్తికి మించిన కార్యం...."

"ఈ సమయంలో రాయలవారి సహాయం మనకెంతైనా అవసరం. వారు తప్పక సహాయం చేయగలరనే నా నమ్మకం." అన్నాడు యువరాజు.

"రాయలవారికి అన్ని విషయాలు వివరంగా తెలియజేస్తూ, నేడే లేఖ వ్రాసి ప్రత్యేక వార్తాహరులద్వారా పంపించండి రామభద్రప్పగారూ...."

"చిత్తం."

"దళవాయి ప్రధానిగారికి సహాయంగా నేను తిరునల్వేలికి వెడతాను...."

"మరి తిరువడి మీదికి?" యువరాజు అడిగాడు.

"రాయలవారు తప్పక మనకు సహాయం చేస్తారనే నా నమ్మకం. వారికి తోడుగా నువ్వు తిరువడికి వెళ్ళు."

"యువరాజు గారి కెందుకీ శ్రమ? నాకు అనుమతి యివ్వండి."

"వద్దు రామభద్రప్పగారు.... మీరు మధురలోనే వుండండి. నేనూ, దళవాయి గారూ లేని సమయంలో మీ వంటి అనుభవజ్ఞులు యిక్కడే వుండి రాజ్య వ్యవహారాలు చూడాలని నా అభిప్రాయం."

"తమ అభిప్రాయాన్ని ఆదేశంగా శిరసావహిస్తున్నాను. కాని, ప్రభువులకు నా దొక విన్నపం."

"చెప్పండి...."

"మరేమీ లేదు.... మునపటిలా ప్రభువులు యుద్ధ రంగంలో మొదటి వరుసలో నిలబడి యుద్ధం చేయడం అంత మంచిది కాదని మనవిచేస్తున్నాను."

"మొదటి నుంచీ మా శ్రేయస్సుని కోరుతున్నవారిలో మీరు మొదటివారు. మీ మాటను తప్పక గౌరవిస్తాను."

"కృతజ్ఞుణ్ణి."

"ఏదో శక్తి వున్నంతవరకూ పోరాడుదామని అభిలాష. ఆ అభిలాషతోనే యుద్ధాలకు దిగడం తప్ప, పెరిగే వయస్సుని దాచలేముగదా!" నవ్వుతూ అన్నాడు విశ్వనాథ నాయనయ్య.

## 5

ఆ నాడు మధురానగరం విజయోత్సవం జరుపుకుంటోంది. నగరం కన్నుల వైకుంఠంగా అలంకరించబడింది. ఆ ఉత్సవంలో దండనాథులూ, వీర యోధులేకాక పుర ప్రముఖులు కూడా చాలామంది పాల్గొన్నారు. అందుకే ఆ పండగకి ఎంతో శోభ వచ్చింది.

అరియనాథ మొదలికి సహాయంగా నిలబడడానికి విశ్వనాథనాయనయ్య తిరునల్వేలికి వెళ్ళాడు. కాని అక్కడి పరిస్థితులూ, వీరవరేణ్యుల హాహాకారాలూ ఆయన్ని యుద్ధరంగంలో ప్రవేశింపజేశాయి. దళవాయి ప్రధానీ, తదితరులూ వద్దువద్దని కోరినా, కరవాలం చేబూని ఆయన మొదటి వరుసలో మదగజంలా నిలబడ్డాడు. అది చూచి పంచపాండ్యులు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. వారలా ఆశ్చర్యాంబుధిలో మునిగితేలుతూ వుండగా, విశ్వనాథనాయనయ్య కత్తి తిప్పుతూ శత్రు సైనికుల మీదికి సింహంలా ఉరికాడు. శత్రువీరులు బెదిరిపోయి వెనుకంజ వేశారు. అది చూసిన పంచపాండ్యులకు గుండెలు జారాయి. పై పెచ్చు విశ్వనాథనాయనయ్య ప్రదర్శించిన ధైర్యసాహసాలకు వారు ముగ్ధులయ్యారు: భయభ్రాంతులయ్యారు; తమ అసమర్థతను గ్రహించారు. దీర్ఘాలోచన పిమ్మట ఒక నిర్ణయానికి వచ్చి, ఆ నిర్ణయాన్ని దళవాయి ప్రధానికి తెలియజేశారు.

'విశ్వనాథ నాయనయ్యవారి ధైర్య సాహసాలు తెలియక, వారితో యుద్ధానికి దిగినందుకు మేము పరితపిస్తున్నాము. పాండ్యమండలం మా చేతినుంచి జారిపోకుండా వుండాలనే తావత్రయంకొద్దీ ప్రతిఘటనకు తలపడ్డాము. అంతే కాని విజయనగర సార్వభౌములయందుగాని, ప్రభువులయందుగాని మాకు అవిశ్వాసం లేదు. వారిపట్ల మాకు ఆదరాభిమానాలున్నాయి. ప్రభువులు ఇంత బలసంపన్నులని, వారు ప్రదర్శించిన ధైర్య సాహసాలు మాకు తెలియజేశాయి. ప్రభువులు కనక సమ్మతిస్తే, వారితో సంధిచేసుకోవాలని మా అభిలాష. మా అభిలాషను ప్రభువులు మన్నిస్తారని మా ఆశ.'

పంచపాడ్యుల అభిలాషను సహర్షంగా మన్నించాడు విశ్వనాథనాయనయ్య. ఆ విధంగా యుద్ధం ముగిసినందుకు సంతోషించారు. తిరునల్వేలి మండలం మధురలో ఒక భాగమయింది.

### చాటు

తప్పతాగిన ఒక త్రాగుబోతు సిటీ నడిబజారులో గుడ్డలన్నీ విప్పి భుజంమీద వేసుకొని (ఒంటిమీద గుడ్డముక్కయినా లేకుండా) తూలుతూ నడవడం ఒక పోలీసు కంటబడింది. పోలీసు వెంటనే పరిగెత్తి వచ్చి అతన్నాపి:

"ఏమి నీ ఉద్దేశ్యము, పబ్లిక్ బజారులో గుడ్డలిప్పివేసి భుజము మీద వేసుకొని నగ్నంగా నడవడానికి?" అన్నాడు లాఠీని నేలమీద కొడుతూ.

"సారీ సర్ –గుడ్డలేసుకుందామంటే దగ్గర్లో ఎక్కడా చాటుగా వుండే చోటు కనిపించడములేదు" అన్నాడు తడుముకోకుండా పరిసరాలను పరికించి చూస్తూ.

—పి. రామబ్రహ్మంరాజు, ద్రోణాచలం


బహుమతి ఒక సంతోషకరమైన బహుమతి

ఐ. ఓ. బి క్యాష్ సర్టిఫికేట్స్

సల్పమొత్తమైన రూ. 37–20 లకు ఒకటి మీరు కొనండి, అది రూ. 100/–లకు వృద్ధి చెందుతుంది.

మా బ్రాంచీలలో దేనినైనా సందర్శించండి.

ఐ. ఓ. బి. క్యాష్ సర్టిఫికేట్ కొనుగోలు చేయటానికి 5 నిమిషాలు చాలు.

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్

మీ అభివృద్ధికి అనువైన బ్యాంకి

తిరువడి మీదికి తరలి వెళ్ళిన అచ్యుత దేవరాయలవారితో యుద్ధం చెయ్యలేక పోయాడు భూతలరామవర్మ. గత్యంతరం లేక అతడు రాయలవారితో సంధి కుదుర్చుకున్నాడు. ఆ యుద్ధంలో యువరాజు కృష్ణప్పనాయకుడు పాల్గొని రాయలవారికి సహాయం చేశాడు.

తిరునల్వేలి సంక్రమించిన ఆ మరునాడే, విశ్వనాథనాయనయ్య ఆ మండలం అభివృద్ధికి కృషి చెయ్యసాగాడు. దళవాయి ప్రధానితో మంతనాలు సాగించాడు తత్ఫలితంగా తిరునల్వేలి పట్టణాన్ని విస్తృతపరిచేందుకు సన్నాహాలు జరగసాగాయి వీధుల్ని విశాలం చెయ్యసాగారు. కొత్త గ్రామాలు కొన్ని వెలుగులోకి వచ్చాయి. బూజు పట్టిన గుళ్ళు గోపురాలు కలకలలాడుతూ కనిపించసాగాయి. చెరువుల తవ్వకం మొదలయింది. కాలవలు తవ్వారు. వ్యవసాయాభివృద్ధికి ఆ విధంగా కృషి సాగింది.

త్వరత్వరగా తిరునల్వేలి పట్టణం, తత్పరిసరాలూ అభివృద్ధిచెందడం చూసి ఆ ప్రాంతపు ప్రజలు తృప్తిచెందారు.

విశ్వనాథనాయనయ్యకు కలిగిన సంతోషానికి మేరలేదు.

రాజ్యం నలుమూలలా శాంతి భద్రతలు సుస్థిరమై, ప్రజలు సుఖ సంతోషాలతో కాలం గడపాలన్నదే విశ్వనాథనాయనయ్య లక్ష్యం. అందుకు చిత్తశుద్ధితో కృషిచేసే సహృదయుల తోడ్పాటు లభించింది.

## దీపాల రూపాలు

దీపావళీ అమావాస్య
సర్వులకూ నేత్ర పర్వం!
నాటిరాత్రి ఒక్కొక్క దీపం
ప్రదర్శిస్తుం దొక్కొక్క
రూపం!!

కొన్ని చుక్కల దండలు!
కొన్ని వెన్నెల పిండులు!!
కొన్ని సంజ మెరుపులు!
కొన్ని మబ్బుల మెరుపులు!!
కొన్ని అపరంజి తీగలు!
కొన్ని పగడాల పోగులు!!

కొన్ని మెత్తని లేజివురులు!
కొన్ని గుత్తులు గా
క్రొవ్విరులు!!
కొన్ని పెరిగే చెట్లు
కొన్ని యెగిరే పిట్టలు!!
ప్రతి దీపం జ్వలిస్తుంది!
ప్రకృతిని ప్రతిఫలిస్తుంది!!

—డాక్టర్ వింజమూరి

'శ్రేయాంసి బహు విఘ్నాని' మళ్ళీ మరో యుద్ధం!

కంబం గూడలూరుసీమను పరిపాలించే రాజు విశ్వనాథనాయనయ్య అధికారాన్ని ప్రతిఘటించాడు. కప్పం చెల్లించడానికి నిరాకరించాడు. అప్పుడు విశ్వనాథనాయనయ్య ఆజ్ఞానుసారం రామభద్రప్పనాయుడు ససైన్యంగా వెడలి కంబం ముట్టడించాడు. విజయలక్ష్మి మధురనే వరించింది.


ఇన్ని విజయాలను సాధించిన విశ్వనాథనాయనయ్య ఆనాడు విజయోత్సవం జరుపుకుంటున్నాడు. ఆ ఉత్సవాన్ని తిలకించేందుకు పాండ్యమండలంలోని ప్రముఖులందరూ మధురకు తరలి వచ్చారు.

ప్రభువుల ఆజ్ఞను శిరసావహించి దళవాయి ప్రధాని అరియనాథమొదలి ఆనాటి సభలో ఇలా ప్రసంగించాడు:

"శ్రీమంతులూ సకల గుణ సంపన్నులయిన, మహామేరు సమానధీరులయిన, అఖండిత లక్ష్మీ ప్రసన్నులయిన శ్రీమన్మహామండలేశ్వర రాజమాన్య మహారాజరాజశ్రీకాశీవిశ్వనాథనాయనయ్యవారు మనకు ప్రభువులు కావడం మన భాగ్యవిశేషం. వారికి మీనాక్షీ సుందరేశ్వరుల కరుణాకటాక్షములు కలుగుగాక! జయం లభించుగాక!"

సభికుల హర్షధ్వానాలు ముగిసిన పిమ్మట, దళవాయి ప్రధాని ప్రసంగం కొనసాగింది:

"రాజ్యం నలుమూలలా శాంతిభద్రతలు సుస్థిరంగావుండాలన్నదే మన ప్రభువుల లక్ష్యం. ఈ లక్ష్యంతోనే వారు తమ సొంత ద్రవ్యమును కూడా ప్రజాహిత కార్యాలకు వినియోగించారు. ప్రస్తుతం చిట్టడవులు నశించి. చూడచక్కని గ్రామాలు ఏర్పడుతున్నాయి. చోరభయం నశించి ప్రజలు రాకపోకలకు అవరోధాలు తొలగిపోతున్నాయి. చెరువులు కాలవలు ఏర్పడడంవల్ల గ్రామసీమలు పచ్చపచ్చగా కనిపిస్తున్నాయి. నిత్య పూజాదిక కార్యక్రమాలతో గుళ్ళు గోపురాలు కలకలలాడుతున్నాయి. రాజ్యంలో శాంతిభద్రతలు సుస్థిర మవుతున్నాయి. అయినా ప్రాచీన పాండ్యరాజుల సంతతివారూ, మరికొందరు ప్రముఖులూ ఆయా ప్రదేశాలలో పలుకుబడి కలిగివున్నారు. వారందరితోను సఖ్యసంబంధం కలిగివుండా



దీపావళి శుభాకాంక్షలు

జి. రాధ

ఫోన్ నెం : 8297

ఉషా సూయింగ్ మిషన్లు, ఫ్యాన్లకు ఆథరైజ్డు డీలర్సు

కమాన్ బజార్,
వెంకటేశ్వరస్వామి గుడివద్ద.
ఖమ్మం–507 001.

సులభ వాయిదాల పద్ధతిమీద కుట్టుమిషన్లు పొందండి.

7 లక్షలకు పైగా బహుమతులు
ఉషా పంకా ఒకటి కొనండి
దానితోపాటు ఒక బహుమతి పొందండి.

అన్నదే ప్రభువుల ఆశయం. అప్పుడే రాజ్యంలో నిజమైన శాంతి నెలకొనగలదనీ వారి వుద్దేశం. అందువల్ల, ప్రభువుల ఆజ్ఞ ననుసరించి నేటి నుంచీ మన రాజ్యం డెబ్బయి రెండు పాళెములుగా విభజించబడుతుంది. పాళెగార్లను నియమించడం కూడా జరుగుతుంది. ఆయా పాళెములకు సంబంధించిన అన్ని వ్యవహారాలూ పాళెగార్లే పర్యవేక్షిస్తారు. అయితే ప్రభువుల పట్ల వారందరూ వినయవిధేయులై సంచరించాలి. ఈ కొత్త విధానం వల్ల, మన రాజ్యంలో వైరభావం తొలగి స్నేహభావం నెలకొని, శాంతిభద్రతలు సుస్థిరమవుతాయని ఆశిస్తున్నాము. సమరంవల్ల ధన వ్యయమేకాక శాంతికి భంగం ఏర్పడుతుంది. అందువల్ల, ప్రజలు బాధావహులవుతున్నారు. ఈ పాళెపు విధానాన్ని మీరందరూ ఆదరించి రాజ్యంలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి తోడ్పడాలనికోరుతున్నాను."

దళవాయి ప్రధాని ప్రసంగాన్ని చెవులు నిక్కబొడుచుకొని ఆలకించిన ప్రముఖుల ముఖాలలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఇక రాజ్యంలో చీటికి మాటికి యుద్ధాలుండవనీ,శాంతి భద్రతలు స్థిరంగా ఉండగలవనీ తలచుకుని సంతోషించారు.

సభికులలో కానవచ్చిన సంతోషం విశ్వనాథనాయనయ్యకు నవోత్సాహం ప్రసాదించింది.

సదస్సుల హర్షధ్వానాల మధ్య ఆయన లేచి, ముకుళిత హస్తులై ఇలా అన్నారు:

"మీనాక్షీ సుందరేశ్వరుల కరుణా కటాక్షాల వల్ల, రాజ్యం నలుమూలలా శాంతి భద్రతలు సుస్థిరమై, సర్వ ప్రజలూ సుఖ సంతోషాలతో ఉండాలన్నదే మా లక్ష్యం.... చిట్టడవులు ఛేదించాం. కొత్తగ్రామాలు నిర్మించాం. వ్యవసాయాభివృద్ధికి తగిన పనులు నిర్వర్తించాం. అయినా, మారుమూల గ్రామాలలో ఇంకా దుష్టమృగాలు సంచరిస్తున్నాయనీ, ప్రజలు బాధలకు పాల్పడుతున్నారనీ అప్పుడప్పుడు వార్తాహరులమూలంగా వింటున్నాం. వారి బాధలను కూడా రూపుమాపాలని మా సంకల్పం.... ఈ శుభ సమయంలో మా శ్రేయోభిలాషులూ, మా నాయనగారి ముఖ్యాశ్రితులలో ప్రముఖులూ అయిన రామభద్రప్ప నాయడుగారికి వేదకరై పాళెమును సర్వాధికారములతో బహూకరిస్తున్నాము. మిగిలిన పాళెములకు కూడా అధిపతుల నియామకం త్వరలోనే జరుగుతుంది."

"అరువన్నిబ్బరగండ! (డెబ్బయి రెండు పాళెములు జయించినవాడా) జయీభవ, విజయీభవ!" అనే జయజయ ధ్వానాలతో సభా భవనం ప్రతిధ్వనించింది.

## రక్కసి బలపు ఆగడం

కలవారి ఇంటిముందు
కన్నుల కింపుగా పెరుగుతున్న
క్రోటన్లనూ కాక్టస్సులనూ చూసి
ముచ్చటపడ్డాదొక ముదిరైతు.
దారి పక్క పడియలో
పచ్చగా బలంగా అలముకొన్న
ఆకుల గుంపు అందంచూసి
ఒక కుదురు పీకి
బాడవ పొలం అంచున
ఓ మూల నాటేడు.
సత్తువా సారం కల భూమేమో
గుర్రపు డెక్కాకు
గునగున విస్తరించేసింది
పీకి పారేసినకొద్దీ
పెరిగి పెరిగి వ్యాపిస్తోంది
నోటిముందు కూటిని కాజేస్తున్న
రాక్షస జాతినేం చేయాలో తెలియక
రైతొక్కడే కాదు
ఊరూ నాడూ తల పట్టుకుంటోంది.
తుంగలో తొక్కినా
ఎండబెట్టి మాడ్చినా
ఎన్నెన్ని విధాల హతమార్చ బూనినా
రక్కసి బలపు ఆగడం/ఆగదు
యుద్ధ ప్రాతిపదికపై/జనాల
మొత్తం సన్నద్ధమైతే తప్ప.

—కౌ రా